## 193. చావు భయం

తీర్థ యాత్రలకి వెళ్ళే పద్మావతి నర్మదా నదీ తీరానికి వచ్చింది. రేవు దాటే పడవ సిద్ధంగా ఉండటం చూసి అందులోకి ఎక్కింది. అప్పటికే దట్టమైన నల్లటి మేఘాలతో అలుముకుని ఉన్న ఆకాశంలో అకస్మాత్తుగా తీవ్రమైన వేగంతో గాలులు చెలరేగి పడవ ప్రమాదంలో పడింది. దాన్ని కంట్రోల్ చేయడానికి పడవ వాడు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. అంతా భయపడ్డారు.

అదే పడవలో ప్రయాణించే ఓ సన్న్యాసి మాత్రం నిశ్చలంగా కూర్చున్నాడు. పడవ క్షేమంగా ఆవలి తీరం చేరాక అడిగిందామె అతన్ని.

"మేమంతా అంత భయపడితే మీరు అలా ఎలా నిర్భయంగా కూర్చోగలిగారు?"

"నేనిప్పటికిప్పుడు నిన్ను గొంతు పిసికి చంపేస్తానంటే నువ్వు భయపడతావా?" ప్రశ్నించాడు సన్న్యాసి.

"ఊహు. మీకు నా మీద ద్వేషం ఉంటే భయపడతాను తప్ప లేకపోతే నాకెందుకు భయం?"

"అలాగే భగవంతుడికి నా మీద ద్వేషం లేదు. పైగా నన్ను ప్రేమించే ఆయన నా ప్రాణాలు తీస్తాడని నేనెందుకు భయపడాలి? ఆయన సృష్టించిన తుఫాను ఉత్తి బెదిరింపు మాత్రమే. కాలం తీరాక ఎవరైనా చావాల్సిందే. కాబట్టి అంతదాకా చావు భయం అనవసరం." బోధించాడు ఆ సన్న్యాసి.

## 194. శ్రమ - ప్రేమ

ఢిల్లీనించి బయలుదేరిన ఓ రైల్లో ఓ సన్న్యాసి టాయ్‌లెట్ పక్కన పేపర్ పరుచుకుని పడుక్కుని ప్రయాణం చేయడం తన కుటుంబ సభ్యులతో అత్తవారింటికి వెళ్తున్న ఓ గృహస్థు గమనించాడు.

"ఎక్కడికి?" అడిగాడు.

"చెన్నైకి." జవాబు చెప్పాడు సన్యాసి.

"అక్కడ ఎవరున్నారు?"

"మైలాపూర్‌లో కపాలేశ్వర స్వామి, వడపళనిలో సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయాలు చూడటానికి."

"టిక్కెట్ లేకుండా టాయ్‌లెట్ పక్కన తడిలో పడుక్కుని అంతదూరం ప్రయాణించడం అనవసరపు శ్రమ కాదా?"

సన్యాసి చిన్నగా నవ్వి ఆ ప్రశ్నకి ఇలా జవాబు చెప్పాడు.

"వేసవి శెలవలకి మీరు మీ కుటుంబ సభ్యులతో, బరువైన పెట్టెలతో, కిక్కిరిసిన రైళ్ళల్లో ఎందుకు ప్రయాణం చేస్తున్నారు? మీరు ప్రేమించేవారితో గడపాలనేగా అంత శ్రమ పడేది? అలాగే నేనూ అంతలా ప్రేమించే దేవుడి దగ్గరకి ఎంతటి శ్రమనైనా ఓర్చి వెళ్తూంటాను."

ఆ ప్రయాణీకుడికి రైళ్ళల్లో టి.సి.లు దింపేస్తున్నా ఇంకో రైలెక్కి ప్రయాణించే సాధువుల ప్రయాణం వెనక గల భక్తి అర్థమైంది.

## 195. ధన్యుడు

ఓ గ్రామంలో రంగడు, రాజు అనే ఇద్దరు మిత్రులున్నారు. ఇద్దరికీ సమానమైన దైవ భక్తి ఉంది. రంగడు నిత్యం దైవ ప్రార్ధన చేస్తూ, తనకి ఏం కావాలో దేవుణ్ని కోరుకుంటాడు.

తన భార్య ఆరోగ్యం కుదుట పడాలని ఉదయం కోరుకుంటే రాత్రికల్లా ఆవిడ సంపూర్ణ ఆరోగ్యవంతురాలు అవుతుంది. ఇలా అతను దేవుణ్ని అడగని కోరికలేదు. దాన్ని దేవుడు తీర్చని కోరిక లేదు.

రాజు విషయం ఇందుకు పూర్తిగా విరుద్ధం. అతను దేవుణ్ని పూజిస్తాడు కాని ఏ కోరికా కోరడు. కోరడానికి అతనికి ఒక్క కోరికా లేదు.

ఆ ఊరిమీంచి వెళ్తున్న ఓ జ్ఞానిని రాముడు, రాజు కలుసుకున్నారు.